# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 66 EDITOR:CHERUKU UPENDAR, DATE : SATURDAY 1 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 66, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 1 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## కిషన్ రెడ్డికి అరుదైన గౌరవం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. వచ్చే నెల 10 నుంచి 14 వరకు న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి హైలెవల్ పొలిటికల్ ఫోరమ్ (హెచ్ఎల్‌పిఎఫ్)లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, కార్యనిర్వాహక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ప్రసంగించనున్నారు.

మిగతా 2లో...

64

## 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. యూనివర్సిటీ వరకూ మెట్రోలోనే ప్రయాణించిన మోదీ... ప్రయాణికులతో ముచ్చటించారు. ఆ తరవాత వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందని చెప్పిన మోదీ...దేశ పురోగతికి విద్యాసంస్థలే ప్రతీకలు అని వెల్లడించారు. ఢిల్లీ యూనివర్సిటీ కేవలం యూనివర్సిటీ మాత్రమే కాదని, ఎంతో మందికి జీవితాలను అందించిందని కొనియాడారు. ఎన్నో ఉద్యమాలకూ ఈ యూనివర్సిటీ ఊపిరి పోసిందని అన్నారు. గతంలో ఢిల్లీ యూనివర్సిటీ కింద కేవలం 3 కాలేజీలు మాత్రమే ఉండేవని ఇప్పుడా సంఖ్య 90కి చేరుకుందని గుర్తు చేశారు. ఇదే సమయంలో భారత దేశం ఆర్థికంగానూ పురోగతి సాధిస్తోందని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా దేశంలో ఎమ్,ఎఎ౬, ఔమ ల సంఖ్య పెరిగిందని తెలిపారు. "భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళు పూర్తైంది. సరిగ్గా ఇదే ఏడాది ఢిల్లీ యూనివర్సిటీ 100 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇది కేవలం ఓ యూనివర్సిటీ కాదు. ఎన్నో

మిగతా 2లో...

# తెలంగాణలో.. బీజేపీలో ఆధిపత్య పోరు



● కమలానికి బిగ్ షాక్ తగలనుందా..? ● సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో అలజడి ● ఒక్కసారిగా డీలాపడిన కమలనాథులు ● బీజేపీలో గుర్తింపు లేదని ఆవేదన ● సమన్వయంతో పనిచేయాలని సూచిస్తున్న మోడీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో బీజేపీలో ఆధిపత్య పోరు నడుస్తున్న వేళ.. కమలానికి బిగ్ షాక్ తగలనుందా..? సిట్టింగ్ ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తితో రగిలిపో తున్నారా..? పార్టీ కోసం అహర్నిశలు శ్రమించినా గుర్తింపు లేదని ఆవేదన చెందు తున్నారా..? కొంత కాలంగా బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన ఇక భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడానికి సిద్ధపడ్డారా..? అంటే తాజా పరిణామాలను.. ఆ ఎమ్మెల్యే చేసిన ప్రకటన బట్టి చూస్తే ఇది అక్షరాలా నిజమయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అసలే బీజేపీ గందరగోళ పరిస్థితులు, దీనికి తోడు, రాష్ట్ర అధ్యక్షుడి మార్పు, తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కీలక నేతలకు పదవులు కట్టబెడుతున్నారన్న పరిస్థితుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నట్టుండి బాంబ్ పేల్చారు. దీంతో బీజేపీలో అసలేం జరుగుతోంది..? పార్టీ బలోపేతం అవుతోందా లేకుంటే ఇంకేమైనా జరుగుతోందా..? అని క్యాడర్ అయోమయంలో పడింది. ఇంతకీ ఎవరా ఎమ్మెల్యే.. ఎందుకింత రచ్చ..? పార్టీ నుంచి ఆయన ఏం

మిగతా 2లో...

2

## "గుండె పగిలిపోతోంది"

### రాహుల్ సోషల్ మీడియాలో పోస్ట్

ఇంపాల్-ప్రభాత సూర్యుడు



కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మణిపూర్‌లో పర్యటిస్తున్నారు. బాధితులు ఎక్కువగా ఉన్న మొయిరాంగ్‌లోని ప్రజల్ని పలకరించారు. వారితో కాసేపు మాట్లాడారు. అక్కడి బాధితుల్లో కొందరు రాహుల్‌ని పట్టుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. వాళ్లను ఓదార్చిన రాహుల్.."గుండె పగిలిపోతోంది" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "ఇక్కడి ప్రజల్ని కదిలిస్తేనే గుండె పగిలిపోతోంది. చాలా మంది తమ వాళ్లను పోగొట్టుకున్నారు. నిరాశ్రయులయ్యారు. ప్రతి ఒక్కరూ సాయం కోసం అర్థిస్తున్నారు. చిన్నారులు వెక్కివెక్కి ఏడుస్తున్నారు. ఇప్పుడు మణిపూర్‌లో శాంతియుత వాతావరణం ఎంతో అవసరం. ఇంత మంది ప్రాణాల్ని కాపాడేందుకు అందరం కలిసి కట్టుగా పని చేయాలి. ఇక్కడి ప్రజలు .

మిగతా 2లో...

## ధరణి తీసేస్తే రైతుబంధు ఆగుతుంది

### సీఎం కేసీఆర్

అదిలాబాద్-ప్రభాత సూర్యుడు



తెలంగాణ వచ్చాకే గిరిజన, తండాలను డెవలప్ చేశామని సీఎం కేసీఆర్ అన్నారు. ఒకప్పుడు అంటురోగాలతో ఉమ్మడి ఆదిలాబాద్ తల్లడిల్లి పోయిందని, ఇప్పుడు పరిస్థితి మొత్తం సద్దుమణిగిపోయిందని అన్నారు. తెలంగాణ వచ్చింది కాబట్టే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు అయిందని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. రెండు మూడు నెలల్లో మారుమూల తండాలకు, పొలాలకు కూడ త్రీ ఫేస్ కరెంట్ ఇస్తామని చెప్పారు. రెండు మూడు రోజుల్లో 47 వేల ఎకరాల పోడు భూములను పంపిణీ చేస్తామని అన్నారు. కాంగ్రెస్ నేతలు అవాకులు, చవాకులు పేల్చుతున్నారని అన్నారు. ధరణి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ నేతలు మాత్రం తీసేయాలని అంటున్నారని అన్నారు. ధరణి వల్లే భూములు ఇతరుల పేరు మీదకు మార్చడం కుదరదని, రైతు మరణించగానే

మిగతా 2లో...

## క్షమాపణ చెప్పి తర్వాత రండి..!

### కేటీఆర్ కామెంట్

వరంగల్-ప్రభాత సూర్యుడు



వరంగల్ ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన ప్రధాని నరేంద్ర మోడీ క్షేమపణ చెప్పిన తర్వాతే వరంగల్ కు రావాలి అని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో పోడు భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. మరో పదిరోజుల్లో నరేంద్ర మోడీ వరంగల్ కు వస్తున్నారు.. వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజల తరుపున అడుగుతున్నానని ట్రైబల్ యూనివర్సిటీ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు.

మిగతా 2లో...

## కేసీఆర్ ఒక యాంటి ఫార్మర్

### వైఎస్ షర్మిల రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



వైయస్ఆర్ ఇమేజ్ ప్రో పూర్, ప్రో ఫార్మర్, ప్రో అగ్రికల్చర్ అయితే, కేసీఆర్ కున్న ఇమేజ్ యాంటి పూర్. కేసీఆర్ ఒక యాంటి ఫార్మర్, కేసీఆర్ పాలన యాంటి యూత్, కేసీఆర్ ప్రభుత్వం యాంటి ఉమెన్, కేసీఆర్ అంటే యాంటి మైనారిటీస్ కరప్షన్ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే కరప్షన్ అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల అరోపించారు. నాగలోకానికి, నక్కకు ఎంత తేడా ఉందో. వైయస్ఆర్ పాలనకు, కేసీఆర్ పాలనకు అంత తేడా ఉంది. 9ఏండ్ల పాలనలో రాష్ట్రం సమతుల్య అభివృద్ధి అని చెప్తున్న కేటీఆర్, మీకో సవాల్. మీ తండ్రి

మిగతా 2లో...

## బీఆర్ఎస్ చేసింది గుండు సున్నా

### సీఎల్పీ నేత భట్టీ

ఖమ్మం-ప్రభాత సూర్యుడు



అభివృద్ధి అంటే కాంగ్రెస్ హయాంలో వేసిన రోడ్ల మధ్యన డివైడర్లు కట్టి, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి, కలర్లు వేస్తే అభివృద్ధి అవుతుందా అని సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. అభివృద్ధి అంటే నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు కట్టాలి. స్పాంజ్ ఐరన్ కంపెనీలు తీసుకురావాలి. సింగరేణి సంస్థ ద్వారా లక్షల మందికి ఉపాధి కల్పించాలి... కొత్త పవర్ ప్రాజెక్టు సంస్థలు తీసుకురావాలి....గూడు లేనివారికి ఇళ్ళు ...,విద్యా, వైద్యం, ఉద్యోగాలు లేని యువతకు స్వయం ఉపాధి ద్వారా రుణాలు ఇచ్చి వారి జీవన ప్రమాణాలు పెంచడం నిజమైన అభివృద్ధి అని అన్నారు. ఖమ్మం జిల్లాకు బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏంటి? 10 ఏండ్ల పరిపాలనలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేశారా? కొత్త పరిశ్రమ తీసుకువచ్చారా? కొత్తగా కొలువులు ఇచ్చారా? బిఆర్ఎస్ చేసింది ఏమీ లేదు గుండు సున్నా అని ఆరోపించారు.

మిగతా 2లో...

## అడ్డంకులొచ్చిన కాంగ్రెస్ జనగర్జన

### -రేవంత్ రెడ్డి



ఖమ్మం-ప్రభాత సూర్యుడు

ఖమ్మంలో తెలంగాణ జనగర్జన సభకు సంబంధించి సమీక్షించేందుకు ఇక్కడకు వచ్చామని టీపీసీసీచీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ మాట్లాడుతూ సభా ఏర్పాట్లకు సంబంధించి

మిగతా 2లో...

# కిషన్ రెడ్డికి అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)
గ్లోబల్ టూరిజం డెవలప్‌మెంట్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు. న్యూయార్క్‌లోని యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ (జఔచియూ) ఆయనకు ఆహ్వానం పంపింది. ఈ ఏడాది జూన్ 21, 22 తేదీల్లో గోవాలో జరిగిన జీ 20 పర్యాటక మంత్రుల సమావేశం అనంతరం ఈ ఆహ్వానం అందడం విశేషం. ఈ సమావేశానికి కిషన్ రెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడం, దేశాలు, వాటాదారుల మధ్య భాగస్వామ్యం, సహకారాల పెంపుకు జీ 20 టూరిజం వర్కింగ్ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా 'ఇండియా డిక్లరేషన్, గోవా రోడ్ మ్యాప్' అమలుపై ఐక్యరాజ్యసమితిలో ఆయన మాట్లాడనున్నారు. కాగా హెచ్‌ఎల్‌పీఎఫ్ నుంచి ఈ ఆహ్వానాన్ని అందుకున్న తొలి భారతీయ పర్యాటక మంత్రి కిషన్ రెడ్డి కావడం విశేషం. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలలో టూరిజం పాత్రను గుర్తిస్తూ జఔచియూలో నిర్వహించే సమావేశంలో చర్చలు జరగనున్నాయి. పర్యాటక రంగాన్ని వేగవంతం చేయడంపై అగ్ర దేశాలకు చెందిన రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలను ఒకే చోటకు చేర్చనున్నారు. ఈ ఈవెంట్ ద్వారా టూరిజం, ఎస్‌డీజీల మధ్య సంబంధాలను కూడా బలోపేతం చేయనున్నారు. కాగా 'కరోనావైరస్ వ్యాధి ప్రభావాలను వేగవంతంగా పరిష్కరించడం, అన్ని స్థాయిల్లో సుస్థిర అభివృద్ధి కోసం 2030 ఎజెండాను పూర్తిగా అమలు చేయడంపై తీసుకోవల్సిన చర్యలు, విధివిధానాలు' అనే అంశంపై హెచ్‌ఎల్‌పీఎఫ్-2023 ఈ సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ ఫోరమ్‌లో పాల్గొనే నేతలు, వ్యాపారులు అందుకు సంబంధించిన మార్గదర్శకాలపై మాట్లాడనున్నారు.

## 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం

(మొదటిపేజీ తరువాయి)
ఉద్యమాలకు ఊపిరి పోసింది. కొన్నేళ్ల క్రితం ఈ యూనివర్సిటీ కింద కేవలం మూడు కాలేజీలు ఉండేవి. ఇప్పుడు 90కిపైగా ఉన్నాయి. ఒకప్పుడు భారత దేశం సరైన ఆర్థిక వ్యవస్థ లేని దేశాల జాబితాలో ఉండేది. ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. ఢిల్లీ యూనివర్సిటీలో అబ్బాయిల కన్నా అమ్మాయిల సంఖ్యే పెరుగుతోంది"ఇదే ప్రసంగంలో మరి కొన్ని కీలక విషయాలు ప్రస్తావించారు ప్రధాని మోదీ. 2047 నాటికి భారత్‌ని అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేయాలన్నదే తమ లక్ష్యం అని తేల్చి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారత్‌కి గౌరవం పెరుగుతోందని అన్నారు. "2047 నాటికి భారత్‌ని అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేయాలి. అదే మా లక్ష్యం. అమెరికా పర్యటనకు గతంలోనూ వెళ్లాను. కానీ వెళ్లిన ప్రతిసారీ నాకో విషయం అర్థమైంది. భారత్ పట్ల అక్కడి వాళ్లకు గౌరవం పెరుగుతోంది. ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. లింగనిష్పత్తిలోనూ గణనీయ మార్పు సాధించాం. డ్రోన్ పాలసీలోనూ మెరుగయ్యాం. ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశాం. ఇప్పుడు శాంతియుత మార్గంలో దేశాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. భారీ యూనివర్సిటీలు, కాలేజ్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. వాటికి అంతర్జాతీయంగా గుర్తింపు కూడా లభిస్తోంది"

## "గుండె పగిలిపోతోంది"

(మొదటిపేజీ తరువాయి)
ప్రశాంతంగా గపిడేందుకు ప్రయత్నించాలి. రిలీఫ్ క్యాంప్‌లోనూ ప్రజలతోనూ మాట్లాడాను. అక్కడ రోజువారీ సరుకులకే ఇబ్బందిగా ఉంది. వాళ్లకు కావాల్సినవేవీ అందుబాటులో లేవు. ప్రభుత్వం దీనిపై తప్పకుండా దృష్టి సారించాలి. నేనిక్కడే ఉన్నాను. శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఏం చేయాలో అది చేస్తాను"మొయిరాంగ్‌తో పాటు బిష్ణుపూర్‌లోని రిలీఫ్ క్యాంప్‌లలోనూ పర్యటించారు రాహుల్ గాంధీ. అల్లర్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితులను పరామర్శించారు. మణిపూర్ కాంగ్రెస్ చీఫ్ ఓక్రం ఇబ్బోబి సింగ్‌తో పాటు పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ రాహుల్‌తో ఉన్నారు. అంతకు ముందు రోజు చురచంద్‌పూర్‌లోని బాధితులను పరామర్శించారు రాహుల్. అయితే..బాధితులను కలిసేందుకు అధికారులు అంగీకరించడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. రాహుల్ కాన్వాయ్ ను అడ్డుకున్న పోలీసులు రోడ్డు మార్గం ద్వారా వెళ్లొద్దని ఆయనకు సూచించారు. భద్రతా పరమైన కారణాల దృష్ట్యా వాయు మార్గంలో వెళ్లాలని చెప్పారు. హెలికాప్టర్ లో అక్కడి వెళ్లవచ్చని సూచించారు. హింసాత్మక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బిష్ణుపూర్ లో కాన్వాయ్ ని ఆపివేయాలని రాహుల్ గాంధీని కోరినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాహుల్ గాంధీని అడ్డుకోవడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ట్విట్టర్ వేదికగా స్పందించారు. మణిపూర్ లోని బిష్ణుపూర్ సమీపంలో రాహుల్ కాన్వాయ్ ను పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. సహాయ శిబిరాల్లో మగ్గుతున్న ప్రజలను కలుసుకునేందుకు, కలహాలతో అల్లాడుతున్న రాష్ట్రంలో వైద్యం అందించేందుకు రాహుల్ అక్కడికి వెళ్తుండగా పోలీసులు నిలువరించినట్లు చెప్పారు. మణిపూర్ పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడటం లేదని, రాష్ట్రాన్ని వదిలేశారని ఆరోపించారు.

# క్షమాపణ చెప్పి తర్వాత రండి..!

(మొదటిపేజీ తరువాయి)
బయ్యారంలో ఉక్కు కర్మాగారం పెడతాం అన్నారు.. ఎందుకు ఉక్కు పరిశ్రమ పెట్టడం లేదు.. వరంగల్ కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెడుతాం అని మాట తప్పారన్నారు. రైళ్లు తయారీ కేంద్రం పెడతామని చెప్పి ఇప్పుడు మెకానిక్ ఫాక్టరీ పెడతా అంటున్నారు అని కేటీఆర్ విమర్శించారు. వీటన్నింటిపై మాట తప్పినందుకు మోదీ క్షమాపణ చెప్పి రావాలన్నారు. పోడు పట్టాల పంపిణీ ద్వారా 4లక్షల 6 వేల ఎకరాలు 1.50 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని.. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే 24, 972 మంది రైతులకు 70, 434 ఎకరాల భూమిని పంపిణీ చేస్తున్నామన్నారు. జల్ జంగల్ జమీన్ అనే కొమురం భీం నినాదంతో అన్ని తండాలకు మంచినీరు అందిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. బిందెలు, కుండలు పట్టుకుని ఆడపడుచులు రోడ్డు పైకి వచ్చే పరిస్థితి తెలంగాణలో లేకుండా పోయిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. హరిత హారం పేరుతో చెట్ల పెంపకంతో పాటు ఇప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం పోడు పట్టాలు పంపిణీ చేసి భూమి కూడా ఇస్తున్నామన్నారు. 6 శాతం ఉన్న గిరిజనులు, ఆదివాసీల రిజర్వేషన్ ను 10 శాతంకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని కేటీఆర్ అన్నారు. పోడు భూములకు పట్టాలు పొందడంతో పాటు రైతు బంధు, రైతు భీమా పొందుతున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత మీకు పాలన అందుబాటులోకి వచ్చింది అని కేటీఆర్ తెలిపారు. 10 మంది డాక్టర్లు లేని మహబూబాబాద్ సర్కారు దవాఖానకు 110 మంది వైద్యులు వచ్చారు.. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి మోసపోవద్దు.. ఆచరణ సాధ్యం కాని హామీలతో మీ ముందుకు వస్తున్నారు.. వారి మాటలు వింటే మీరు మోసపోతారు అని మంత్రి కేటీఆర్ అన్నారు. అంతకు ముందు గుమ్మడూరులోని రామచంద్రాపురం కాలనీలో 200 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంత్రి ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇంటిపేపర్లను అందజేశారు. అంతకుముందు మానుకోటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం రూ.5 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్ మార్కెట్లను ప్రారంభించారు.

# ధరణి తీసేస్తే రైతుబంధు ఆగుతుంది

(మొదటిపేజీ తరువాయి)
రూ.5 లక్షల బీమా అందుతోందని అన్నారు. ధరణి లేకపోతే దళారీల రాజ్యం వస్తుందని, రకరకాల ఇబ్బందులు వస్తాయని అన్నారు. అదే తీసేస్తే రైతు బంధు కూడా అందే పరిస్థితి కూడా ఉండబోదని అన్నారు. మహారాష్ట్రలో కూడా ప్రజలు బీఆర్ఎస్ పథకాల పట్ల ఆకర్షితులు అవుతున్నారని, మాకు కూడా ఆ పథకాలు కావాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరుతున్నారని అన్నారు.

ఆసిఫాబాద్‌కు చేరుకున్న ఆయన ముందుగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కుమ్రంభీం చౌరస్తాలో కుమ్రంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కొత్తగా నిర్మించిన జిల్లా పోలీస్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. అక్కడ పురోహితులు సీఎం కేసీఆర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్.. కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో సీట్లో కూర్చోబెట్టారు. కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పారు. ఆ తర్వాత కలెక్టర్.. సీఎం కేసీఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు.

# అడ్డంకులోచ్చిన కాంగ్రెస్ జనగర్జన

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సూచనలు, సలహాలు తీసుకుంటాం. జూలై 2న ఖమ్మంలో జరిగే సభకు రాహుల్ గాంధీ హాజరవుతారు. ఖమ్మం వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారవాన్ని పూరిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డుగోడలు పెట్టినా కాంగ్రెస్ కార్యకర్తలు పడగొట్టి తొక్కుకుంటూ సభకు హాజరవుతారు. తెలంగాణ జన గర్జన సభకు ఖమ్మం జిల్లా ప్రజల నుంచి వచ్చే స్పందన మీరే చూస్తారని అయన అన్నారు..

# బీఆర్ఎస్ చేసింది గుండు సున్నా

(మొదటిపేజీ తరువాయి)
పాలేరు నియోజకవర్గ ప్రజల ఓట్లను కాంట్రాక్టుల కోసం కేసీఆర్ వద్ద ఎమ్మెల్యే కందాల ఉపేందర్రెడ్డి అమ్మేసాడని ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యే కందాల ఉపేందర్రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళితే మొగోడిలాగా ఉండేదన్నారు. గతంలో పాలేరు నుంచి శాసనసభ్యులుగా గెలిచిన సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి నేతలు ఏనాడు ప్రజల ఓట్లను కందాల ఉపేందర్ రెడ్డి లాగా అమ్ముకోలేదన్నారు. పాలేరుకు నాగార్జునసాగర్ జలాలు తీసుకొచ్చేలా చేశారని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసి...పాలేరు ప్రజల ముందు తలెత్తుకొనే విధంగా పనిచేశారన్నారు. కందాల ఉపేందర్ రెడ్డి తరహాలో కాంట్రాక్టుల కోసం కేసీఆర్ కాళ్ళ వద్ద మోకరిల్లి ప్రజాస్వామ్య ద్రోహిగా మిగిలి పోయారని ధ్వజం ఎత్తారు. కందాల ఉపేందర్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తావా? నాలుగు నెలలు ఆగితే నిన్ను ...నీ పార్టీని పాలేరు ప్రజలు బంగాళాఖాతంలో పడేస్తారని జోస్యం చెప్పారు. ప్రజలతో రాళ్లు వేయించుకునే దుస్థితి తెచ్చుకున్నందుకు కందాల ఉపేందర్రెడ్డి సిగ్గుపడాల్సింది పోయి అధికారం ఉందని పోలీసులతో కేసులు పెట్టిస్తావా? అని ప్రశ్నించారు. కూసుమంచి పాదయాత్ర వేదిక నుంచి ఏసీపి ని హెచ్చరిస్తున్నా... ఇది ప్రజాస్వామ్య రాష్ట్రం......పోలీస్ రాజ్యం కాదు.... మీరు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసు. మిమ్మల్ని ఎవరు తీసుకొచ్చారో తెలుసు... మీ ఆస్తులు తెలుసు.... మీరు పోలీస్ మాన్యువల్ ప్రకారంగా పనిచేయకుండా సంఘవిద్రోహ శక్తులను అరెస్టు చేసినట్లు అర్ధరాత్రి మండల కాంగ్రెస్ నాయకులు ఇంటికి ఎలా వెళ్తావని ప్రశ్నించారు.. మీలాంటి పోలీసుల గురించి చిట్టా రాస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చట్ట ప్రకారంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పోలీస్ వ్యవస్థ .....రాజకీయ వ్యవస్థ అయితే ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని మీలాంటి పోలీసుల గురించి ఇటీవల సీఎం కేసీఆర్ కు లేఖ రాశానని తెలిపారు. అధికార మదం తలకెక్కితే ఆ మదాన్ని దించడానికి ఆదిలాబాద్ నుంచి కదం తొక్కుతూ ఖమ్మం వరకు వస్తున్నది పీపుల్స్ మార్చ్ అన్నారు. పాలేరు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా... ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.... మీ ఓటుకు విలువ ఇచ్చే వారిని ఎన్నుకోండి. ....మీ ఓటును మీ నమ్మకాన్ని అమ్ముకునే ప్రజాప్రతినిధులను గ్రామాల్లోకి రానివ్వొద్దని భట్టీ కోరారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా జూలై రెండున ఖమ్మంలో నిర్వహించే జనగర్జన సభకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్నారని.... ఇదే సభలో ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరిక ఉంటుందన్నారు. సభను విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున ప్రజలు కదలి రావాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణలో.. బీజేపీలో ఆధిపత్య పోరు..!

(మొదటిపేజీ తరువాయి)
ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ బీజేపీలో ఒక్కసారిగా పెనుమార్పులు వచ్చేశాయ్.. అప్పటి వరకూ అదిగో.. ఇదిగో కేసీఆర్‌ను గద్దె దించేస్తున్నాం.. అని టైమ్ చెప్పి మరీ హడావుడి చేసిన కమలనాథులు ఒక్కసారిగా డీలా పడిపోయారు. ఈ క్రమంలోనే ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మధ్య వర్గ విబేధాలు తలెత్తాయ్. దీంతో రెండు వర్గాలు చీలిపోయిన నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేయడం.. ఇదే సమయంలో ఈటల లేదా డీకే అరుణకు అధ్యక్ష పదవి ఇస్తారని వార్తలు రావడంతో ఒక్కసారిగా బీజేపీ నేతలు భగ్గుమన్నారు. అంతేకాదు.. బండికి కేంద్రంలో కీలక పదవి ఇస్తారని కూడా టాక్ నడిచింది. నాటి నుంచి నేటి వరకూ బండి పదవి, అధ్యక్షుడి మార్పుపై రోజుకో వార్త వస్తూనే ఉంది. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే సీనియర్ నేత, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి ట్విట్టర్ వేదికగా పోస్టు చేసిన వీడియోపై రచ్చ రచ్చ జరుగుతోంది. ఈ వ్యవహారం సద్దుమణగక ముందే.. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతోన్నవారికి బీజేపీలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు.. కొంతకాలంగా పార్టీ కార్యాలయానికి దూరంగా.. సొంత నియోజకవర్గం దుబ్బాకలోనే ఉన్న ఆయన సడన్‌గా ఇలా కామెంట్స్ చేయడంతో ఏదో తేడా కొడుతోందని అందరూ అనుకుంటున్నారు.

### గ్రూపురాజకీయాలకు చేస్తున్న వారికే హైకమాండ్ అండదండలు

'బీఆర్ఎస్ ప్రభుత్వంపై (పోరాడుతున్న నాకు పార్టీ నుంచి ఎలాంటి సహకారం లేదు. గ్రూపురాజకీయాలకు చేస్తున్న వారికే హైకమాండ్ అండదండలు ఉన్నాయి. బీజేపీ ఫ్లోర్ లీడర్ పదవి అడిగినా ఇంతవరకూ నాకు ఇవ్వలేదు. ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ తర్వాత ఫ్లోర్ లీడర్ పదవి ఖాళీగానే ఉంది. జాతీయ అధికార ప్రతినిధి లేదా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా అవకాశం వస్తుందని కనీసం రాష్ట్ర పార్టీలో అయినా తగిన ప్రాధాన్యత ఇస్తారని నేను భావిస్తున్నాను' అని తన ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో చెప్పుకుని రఘునందన రావు తీవ్ర ఆవేదనకు లోనయ్యారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకాదు.. ఇటీవల హైదరాబాద్ వచ్చిన జేపీ నడ్డాతో కూడా ఎమ్మెల్యే తన అసంతృప్తిని తెలియజేశారట. అయితే ఇంత జరిగిన తర్వాత అయినా తన రియాల్టీని గుర్తించి పార్టీ పెద్దలు పదవి ఇస్తే బాగుంటుందని భావిస్తున్నారట. అయితే.. బీజేపీ అగ్రనేతల నుంచి తనకు ఎలాంటి పదవిగానీ గుర్తింపు లేకుంటే మాత్రం కీలక నిర్ణయమే తీసుకునే అవకాశం ఉందని రఘు అనుచరులు చెప్పుకుంటున్నారు. మరోవైపు.. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించకుంటే తెలంగాణలో బీజేపీ పని ఖతమే అని ఎమ్మెల్యే అభిమానులు, ముఖ్య కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. దీనితో 'కమలంలో కల్లోల్లం' రోజు రోజుకూ పెరుగుతూనే ఉందే తప్ప ఈ గందరగోళ పరిస్థితులకు మాత్రం ఫుల్ స్టాప్ పడే పరిస్థితులు మాత్రం కనిపించట్లేదు. ఇప్పటి వరకూ ఇతర పార్టీల నుంచి నేతలు అసంతృప్తి వెళ్లగక్కగా.. ఇప్పుడు ఏకంగా సొంత పార్టీ, అది కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే ఇలా ఆవేదన వెలిబుచ్చారంటే పార్టీలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. రఘునందన్ డిమాండ్ మేరకు అధిష్టానం స్పందిస్తే సరే లేకుంటే బీజేపీకి గుడ్ బై చెప్పేసినా ఆశ్చర్య పోనక్కర్లేదేమో మరి..!.!

## కేసీఆర్ ఒక యాంటి ఫార్మర్

(మొదటిపేజీ తరువాయి)
కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల స్కాం, మీ చెల్లి కవిత లిక్కర్ స్కాం, మీరు రియలెస్టేట్ స్కాం చేయలేదని మీరు సుద్దపూసలని నిరూపించుకునే దమ్ముందా అని ప్రశ్నించారు. ఇన్నాళ్లు పోడు రైతులను కొట్టి,హింసించి, - జైలులో వేసిన దొర కి ఓట్ల పండగ దగ్గరకు రాగానే మళ్లీ పోడు రైతులు యాదికొచ్చారు. తొమ్మి దేండ్లలో ఎనిమిది సార్లు పోడు పట్టాలు ఇస్తానని ప్రకటించి పోడు రైతుల్ని నిండా ముంచాడు. ఊరించి ఊరించి కొసరేసినట్టు కొంతమందికే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా 12.50 లక్షల ఎకరాల్లో పోడు భూములు ఉన్నాయని స్వయంగా అధికారులే లెక్కలు బయటపెడితే, ఆ కాగితాలను చింపేసి కాదు 4.05 లక్షల ఎకరాలే పోడు పట్టాలు అని సొంత లెక్కలు బయటపెట్టాడు. 25శాతం భూములకు మాత్రమే పోడు పట్టాలు ఇచ్చి, మిగిలిన రైతులకు ఎగనామం పెట్టడమే దొర దురాలోచన. పోడు రైతుల పట్ల కేసీఆర్ కు చిత్తశుద్ధే ఉంటే, నాలుక మీద నరమే ఉంటే ఇచ్చిన హామీ ప్రకారం, 12.50లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని ఆమె అన్నారు.

## 8న వరంగల్‌లో ప్రధాని పర్యటన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించ నున్నారు. ఈ మేరకు ప్రధాని తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. జూలై 8న వరంగల్‌లో ప్రధాని పర్యటించనున్నట్లు అధికారిక ప్రకటన విడుదలైంది. ప్రధాని అధికారిక కార్యక్రమాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీజేపీ నిర్ణయించింది. వరంగల్ పర్యటనలో భాగంగా కాజీపేట వ్యాగన్ ఓరలింగ్ సెంటర్‌కు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్కుకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు.

## సంపాదకీయం

# తెరపైకి యూనిఫాం సివిల్ కోడ్

మధ్యప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలతో యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) రాజకీయ చర్చను మళ్లీ రాజుకుంది. భారతదేశం రెండు చట్టాలపై నడుచుకోదని, ఏకరూప పౌర నియమావళి రాజ్యాంగంలో భాగమని ప్రధాని మోదీ అన్నారు. యూసీసీ పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు. దేశం రెండు (చట్టాలు)పై ఎలా నడుస్తుంది? రాజ్యాంగం కూడా సమాన హక్కుల గురించి మాట్లాడుతుంది.. సుప్రీంకోర్టు కూడా యూసీసీని అమలు చేయాలని కోరింది. ప్రతిపక్షాల ప్రజలు ఓటు ఆడుతున్నారు. బ్యాంకు రాజకీయాలు" అని ఆయన అన్నారు.అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ యూసీసీ అంశాన్ని లేవనెత్తారని పలువురు ప్రతిపక్ష నేతలు ఆరోపించడంతో ప్రధాని ప్రకటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.యూనిఫాం సివిల్ కోడ్.. దేశానికి దిక్సూచిగా, భిన్నత్వంలో ఏకత్వానికి కేరాఫ్‌గా మారనుంది. ఇకపై ఒకే దేశం ఒకే చట్టం. దారి తప్పిన మత చట్టాల విశృంఖలత్వాన్ని కట్టుముడితో బంధించడానికి యూనిఫాం సివిల్ కోడ్ అందుబాటులోకి రానుంది. భిన్నత్వంలో ఏకత్వం భారత్ కేరాఫ్. ప్రపంచంలో ఏ దేశానికి లేని ఓ ప్రత్యేకత అది. అయితే.. ఇప్పుడు ఇది సన్నగిల్లుతోంది. జనాభా, మతాల ఆధారంగా ఉన్న చట్టాలు దీనికి తూట్లు పొడుస్తున్నాయి. ఇది గమనించిన బీజేపీ సర్కార్ దేశంలో కొత్త నిర్ణయానికి నాంది పలికింది. వన్ నేషన్ వన్ కార్డ్. తీసుకొచ్చినట్టే.. ఇప్పుడు యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురానుంది. దేశంలో మతం, కులం, వర్గం, వర్ణం, ప్రాంతాలకు అతీతంగా ఈ యూనిఫాం సివిల్ కోడ్‌ను ప్రవేశ పెట్టనుంది. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో ఎప్పటినుంచో ఉంది. అయితే.. గతంలోనే కాంగ్రెస్ ఈ కోడ్‌ను తెద్దామని చూసినా.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం .. దానిని పక్కనపెట్టింది. తాజాగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర సర్కార్ యోచిస్తోంది.ఏ మతానికి తగినట్టు ఆ మతానికి చట్టాలు రూపొందించుకుంటూ పోవడంతో సమాన న్యాయం జరగటం లేదన్నది సమాజం నుంచి ఎదురవుతున్న సమాధానం. ఇది అనేక సార్లు న్యాయవాదుల నుంచి వినిపించిన వాస్తవమే. అయితే అది ఆయా మతాల, జనాభా ఆధారంగానే పట్టాలెక్కడం లేదన్నది కాదనలేని వాస్తవం. సమస్య తలెత్తినప్పుడు న్యాయస్థానాల వరకూ రాకుండా.. వారి మత గ్రంధాల ఆధారంగా.. మత చట్టాలను ఫాలో అవుతున్నారు. ఆ కేసులో పరమతస్తులు ఉంటే.. వారికి అన్యాయమే జరుగుతుంది. ఆ సమయంలో.. యూనిఫాం సివిల్ కోడ్ అమలు ఆవశ్యకత అవసరం ఎంతైనా ఉందన్నది స్పష్టమవుతోంది. భారతదేశం సెక్యులర్ స్టేట్ అని చెప్పుకున్నప్పుడు అన్ని మతాలకు, అన్ని వర్గాలకు కలపి ఒకే చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. నిజానికి రాజ్యాంగం రూపొందించినప్పుడు సెక్యులర్ అనే పదం లేదు. 42 అమెండ్‌మెట్ ప్రకారం.. 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వంలో దాన్ని రాజ్యాంగంలో చేర్చారు. రాజ్యాంగంలో అయితే.. చేర్చారు కానీ సెక్యులర్ వ్యవస్థలో పాటించాల్సిన అంశాలను.. చేయాల్సిన న్యాయాన్ని మాత్రం చేయలేదు. సెక్యూలర్ అనే పదం చేర్చినప్పుడు మత ప్రతిపాదికన ఉన్నచట్టాలను కాంగ్రెస్ ఎందుకు రద్దు చేయలేదు? అనే ప్రశ్న బీజేపీ ఎక్కువగా సంధిస్తోంది. ఓట్ల కోసం.. కాంగ్రెస్ స్వార్థపూరితంగా వ్యవహరించింది కాబట్టే.. సమన్యాయానికి ఇంకా దూరమవుతున్నారనే అంశాన్ని బీజేపీ లేవనెత్తింది.దేశంలో పౌరుల వ్యక్తిగత చట్టాలను మతం, కులం, లింగం, వర్గంతో సంబంధం లేకుండా.. పౌరులందరికీ సమానంగా వర్తించే ప్రతిపాదనను బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. ఒకే దేశం ఒకే చట్టం.. అనే నినాదానికి పిలుపునిచ్చింది. ఇప్పటికే వ్యక్తిగత చట్టాలు పబ్లిక్ నుండి వేరయ్యాయి. దాదాపు ఐదారు వ్యక్తిగత.. మత సంబంధ చట్టాలను దేశంలోని ప్రజలు పాటిస్తున్నారు. ముస్లిం లా.. హిందూ లా.. క్రిస్టియన్ లా.. పర్షియన్ లా.. నేషనల్ లా.. ఇలా ఏ మతానికి చెందిన వారు ఆ మతానికి చెందిన చట్టాలనే పాటిస్తున్నారు. ఇది చెప్పటానికి చూడటానికి మతపరమైనదే అయినా.. సమాజం దృష్టిలోకి వచ్చేసరికి అవి దిద్దుకోలేని పెద్దపెద్ద తప్పులుగా కనిపిస్తున్నాయి.బీజేపీ ప్రతిపాదించిన ఈ యూనిఫాం సివిల్ కోడ్.. ముస్లిం జనాభాకు చెక్ పెట్టడానికి అన్న విమర్శలు లేకపోలేదు. అయితే, ఆ విమర్శల్లో అంగీకరించాల్సిన వాస్తవం కూడా దాగి ఉంది. ముస్లిం మహిళలకు లబ్ధి చేకూర్చేందుకే బీజేపీ దీనిని తీసుకొస్తుంది. గతంలోనూ ట్రిపుల్ తలాక్ రద్దు చేసి అనేక మంది ముస్లిం మహిళలకు స్వేచ్ఛనిచ్చారు. ఇప్పుడు దీనితో బహుభార్యత్వం కూడా రద్దు చేస్తే.. వారికి మరింత లబ్ది చేకూరనుంది. ఇప్పటికే బహుభార్యత్వాన్ని అంతం చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించుటకు నలుగురు సభ్యుల కమిటీని అస్సాంలో సీఎం హిమంత బిశ్వశర్మ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అస్సాంలో లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నామని.. దాదాపు 600 మదర్సాలను మూసేశామని.. మరో 300 మదర్సాలను బంద్ చేస్తామన్నారు. అయితే దీనిపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ అస్సాంలో యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయగలరా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు బీజేపీ చట్టాల విషయంలో చెప్పి మరీ చేసింది. ఇప్పుడు కూడా ట్రిపుల్ తలాక్ మాదిరే యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేస్తే, ముందు ముస్లింలలో ఉన్న బహుభార్యత్వం రద్దు కానుంది. ఇది ముస్లిం సామాజికవర్గంలో చాలా పెద్ద మార్పులకు నాంది అవుతుందికానీ ఓటు బ్యాంక్ రాజకీయాలకు అతీతంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం లాగా బీజేపీ దీనిని అమలు చేయగలదా? అంటూ ఓ వర్గం వాదిస్తోంది. ఈ అంశం ఇప్పుడు మతం రంగు పులుముకున్న జాతీయ అంశంగా మారింది. ఇప్పటికే మత పార్టీగా పేరు తెచ్చుకున్న బీజేపీకి ఇది సాధ్యమా..? అనేది ప్రశ్నగానే ఉంది. ఒక వేళ నిజంగానే యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయగలిగితే.. ఆ వర్గం ఓట్లను బీజేపీ ఎప్పటికీ తిరిగి పొందలేదనడంలో.. కావాలనే ముస్లిం ఓట్లను టార్గెట్ చేసినట్టే అవుతుందనడంలో సందేహం లేదు. ఈ ప్రశ్నలకు బీజేపీ అతి త్వరలోనే సమాధానం చెప్పనుంది.

# ప్రాధాన్యతా రంగాలకు అధిక రుణాలు అందిచాలి

**అత్యధికంగా పంట రుణాలను ఇవ్వాలి**
**లబ్ది దారులకు జాప్యం లేకుండా రుణాలు అందివాలి**
**జాయింట్ కలెక్టర్ స్వర్ణలత**




**జయశంకర్ భూపాలపల్లి -ప్రభాత సూర్యుడు :** రుణ లక్ష్యసాధనకు సమన్వయం అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.స్వర్ణలత శుక్రవారం ప్రగతి భవన్ కార్యాలయంలో బ్యాంకర్ల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఇ, హౌసింగ్ లోన్, ఎద్యుకేషన్ లోన్ క్షుణ్ణముగా సమీక్షించారు మరియు బ్యాంకుల వారిగా వివిధ బ్యాంకు అధికారులతో వ్యవసాయ రుణాలను క్షుణ్ణముగా సమీక్షించారు ప్రభుత్వ పథకాలు అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలని అన్నారు.ఆయా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులతో తరుచూ సంప్రదించి రుణ ప్రక్రియ పూర్తి చేయాలి అన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్దిదారులకు అవగాహనా పరిచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.జిల్లాలో రైతు వేదికలు ఉన్నాయని ప్రతినెల సమావేశాలు చేపట్టి రుణ ప్రగతి పెంచేందుకు మండల స్థాయి అధికారులకు కృషి చేయాలి అన్నారు.అత్యధికంగా పంట రుణాలు ఇవ్వాలన్నారు గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పు కనెందుకు పుకునేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలి అన్నారు . పట్టణ ప్రాంతములో వీది వ్యాపారుల రుణాలు సకాలములో ఇవ్వాలన్నారు ఇద ేవిధంగా రుణ లక్ష్యాలను పెంచుతూ ఇదే దిశగా రుణాలను పెంచుతూ అత్యధిక మంది నిరుపేదలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు సహకరించాలన్నారు .విద్యారుణాలు కూడా అదే అధిక మొత్తంలో ఇవ్వాలని విద్యాభివృద్ధి కృషి చేయాలన్నారు రికవరీ శాతం పెంచినపుడే బ్యాంకు లో రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తాయని అధికారులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. రుణాలు పొందే వారికి కూడా రుణాల వినియోగంలో లబ్ధిదారులకు అధికారులు వెన్నంటి ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.ఐ. ఎల్.డి.ఓ అలీ బాబా, నాబార్డ్ ఏ.జి.ఎం., రవి, డి.ఆర్.డి.ఏ., డి.పురుషోత్తం., జిల్లా అధికారులు, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులకు విద్యార్థుల హాస్టల్,
# కమ్యూనిటీ భవనం కేటాయింపుకు వినతి



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులు,కుల సంఘ మండల ,గ్రామాల నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థుల కోసం హాస్టల్, సంఘ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నియోజ కవర్గలో 60 వేలకు పైగా ఉన్న మున్నూరు కాపు కుటుం భాలున్నాయని, సమావేశాల నిర్వహణ ,ఇతర కార్యక్రమాలకు సంఘ భవననిర్మాణం, విద్యార్థుల కోసం హాస్టల్ వసతి ఆవశ్యకత ను వారు వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించి, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, సుంకే రవిశంకర్, జడ్పీ చైర్మన్ దావా వసంతల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా సీనియర్ సిటీజనన్స్, పెన్షనర్ల, అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, విద్యావంతుల వేదిక సాసల మల్లికార్జున్, మున్నూరు కాపు నియోజకవర్గ నాయకులు కోల శ్రీనివాస్,జంగిలి రాజి రెడ్డి, ఆకుల లక్ష్మీనారాయణ, సమిండ్ల శ్రీనివాస్, వెంకట్, సత్యం,చిట్ల రమణ, కొల్లూరి వేణు, ఆంజయ్య, నీలి మల్లయ్య, రమేష్, తిరుపతి, లైసెట్టి వెంకటి, కొక్కు గంగాధర్, తెలు రాజు, రమేశ్, పుప్పాల కిషోర్,గంగాధర్,గంగారాం, నియోజకవర్గ, మండల, గ్రామ సంఘాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** పేదల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. పెద్ద అంబర్ పెట్ మున్సిపల్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం కావేరి ఫంక్షన్ హాల్ లో 59 జీవో పట్టాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి మాట్లాడుతూ 59 జిబి ద్వారా వందలాది మంది పేదలు లక్ష అధికారులు అవుతున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు అని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా బీసి కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేసే విధంగా కృషి చేస్తున్న అని తెలిపారు. సొంత ఇంటి స్థలం కలిగిన అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రెడ్డి, ఆర్డిఓ వెంకటాచారి, మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, వై చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య, వైస్ ఎంపీపీ కోలన్ శ్రీధర్ రెడ్డి, తహసిల్దార్ అనితారెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరినాట్లు వేసిన ఎమ్మెల్యే చిరుమర్తి

**యాదాద్రి -ప్రభాత సూర్యుడు :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మహిళలతో కలిసి వరి నాట్లు వేసారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ రంగంలో సాధించిన విజయాలపై వరి నాట్లు వేస్తున్న మహిళలతో ఎమ్మెల్యే చిరుమర్తి మాటామంతి చేసారు. తమ దగ్గరకు ఎమ్మెల్యే రావడంలో మహిళలు జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే చిరుమర్తి సాదాసీదాతనం చూసి మహిళలు, గ్రామస్థులు ఆశ్చర్యపడ్డారు.


## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు చిన్నారుల మృతి

**- ఒకరికి గాయాలు**



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు అమ్మాయిలు మృతి చెందిన విషాద సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఫిగ్లిపూర్ గ్రామం సాయి నగర్ కాలనీ చెందిన అబ్దుల్ వాహెబ్ (45) ఇద్దరు కూతుర్లు నైరానోరిన్ (13), బిస్మ రిజ (12)లు గురువారం రాత్రి సికింద్రాబాద్‌కి వెళ్లి తిరిగి స్కూటీపై సొంత గ్రామానికి వస్తున్నారు. అబ్దుల్లాపూర్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గల తందూరి హెూటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా. చికిత్స పొందుతూ ఇద్దరు అమ్మాయిలు మృతి చెందారు. ఈ మేరకు పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కోరుట్ల కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా కొంపల్లి సురేష్



**కోరుట్ల - ప్రభాత సూర్యుడు :** కోరుట్ల కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా న్యాయవాదికొంపల్లి సురేష్ ని నియమిస్తూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆయన సేవలను మూడు సంవత్సరాల కాలం పాటు న్యాయవాదిని పెట్టుకొనే స్థోమత లేని పేదవారికి కోరుట్ల కోర్టు పరిధిలో ఉన్న కేసులని ఉచితంగా న్యాయ సహాయాన్ని లీగల్ ఎయిడ్ ద్వారా పొందవచ్చునని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బద్ది నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బైరి విజయ్ కుమార్ లు తెలిపారు. సురేష్ నియామకం పట్ల పలువురున్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## రెండు కంటైనర్ల ఢీ..ఇద్దరు సజీవ దహనం



మెదక్ - ప్రభాత సూర్యుడు : మెదక్ జిల్లా నార్సింగి మండలం కాస్లాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కంటైనర్ లారీలు డికొన్న ఘటనలో ఇద్దరు సజీవ దహనం అయ్యారు. రెండు లారీలు ఢీకొనడంతో ఒక లారీలో మంటలు చెలరేగాయి. ఓ కంటైనర్ లారీలో గ్యాస్ సిలిండర్ ఉండడంతో మంటలు తీవ్రంగా వ్యాపించాయి. మంటలు భారీ ఎత్తున ఎగసిపడడంతో మంటలు ఆర్పటానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు.

## మాజీ ఎమ్మెల్యే పాయం ధర్నా

మణుగూరు -ప్రభాత సూర్యుడు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ బస్ డిపో ముందుమాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధర్నాక దిగారు. జూన్ 2 న ఖమ్మం వేదికగా జరిగే కాంగ్రెస్ పార్టీ జనగర్జన సభకు బస్సులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. సభ విజయవంతం అవుద్దని కుట్రతోని బస్సు లు ఇవ్వకుండా రవాణా శాఖ మంత్రి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీస్ లకు మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు తీవ్ర వాగ్వివాదం జరిగింది.

## రావినారాయణరెడ్డి కాలనీ ఇండ్లకు జీవో 58,59ను వర్తింప చేయాలని వినతి



అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు : గత కొన్ని సంవత్సరాలుగా పక్కా నివాసాలు ఏర్పాటు చేసు కొని జీవనం కొనసా గిస్తున్న రావి నారా యణరెడ్డి కాలనీ వాసులకు జీవో 58,59ను వర్తిం పజేయాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గత 15 సంవత్సరాలుగా స్థిర నివాసం ఉంటూ ఇంటి పన్ను, కరెంటు పన్ను మంచినీటి పన్ను చెల్లిస్తున్న రావి నారాయణరెడ్డి కాలనీ వాసులు సుమారు 600 కుటుంబాలు ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగి ఉన్నారని, దరఖాస్తు చేసుకొని ఉన్నారని, ఈ దం ఖాస్తులను పున పరిశీలించి స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే గారు చొరవ తీసుకోవాలని, మండల రెవెన్యూ అధికారులకు సూచించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు కిషన్ రెడ్డి స్పందిస్తూ మట్టి భూములపై ఎలాంటి వివా దాలు, అభ్యంతరాలు లేకపోతే ఆర్ఎన్ఆర్ కాలనీ ప్రజలకు పట్టాల పంపిణీ కి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్,సిపిఐ నాయకులు హరిసింగ్ నాయక్ వేణు,ప్రసాద్ పుల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తల్లీ, పిల్లలు ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల జిల్లా -ప్రభాత సూర్యుడు : ప్రేమించి పెళ్లి చేసుకున్న తొమ్మిదేళ్ల తర్వాత డబ్బుల కోసం వేధిస్తున్న భర్త తన భార్యను నాలుగు రోజుల క్రితం పుట్టింట్లో వదిలి వెళ్ళగా, రెండు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిన భార్య బోయినపల్లి మండలం కొదురుపాక మిడ్ మానేరులో తన ముగ్గురు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంది. వేములవాడ మండలం రుద్రవరం చెందిన రజిత, కరీంనగర్ కు చెందిన ఆలీని ప్రేమించి పెళ్లి చేసుకోగా వారికి ముగ్గురు పిల్లలు. గత రెండు సంవత్సరాలుగా రజితను పుట్టింటి నుండి డబ్బులు తేవాలని ఆలీ వేధించడం, రెండుసార్లు పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ కూడా జరిగింది. నాలుగు రోజుల క్రితం రజితను అలీ పుట్టింట్లో దించి, డబ్బులు తెస్తేనే తన వద్దకు రావాలని వెళ్ళిపోయాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయిన రజిత తన ముగ్గురు పిల్లలతో కలిసి మిడ్ మానేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది . మృతుల్లో తల్లి రజిత, ఉస్మాన్ అహ్మద్ (14), అయ్యన్ (7), అశ్రజాబిన్ (5 నెలలు) ఈ సంఘటనపై బోయిన్పల్లి పోలీసులు మృతదేహాలను ఏరియా హాస్పిటల్ కి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# మరపురాని సాంస్కృతిక యోధుడు సాయిచంద్

### సాయి చంద్ కు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు ఘన నివాళులు



మెట్‌పల్లి - ప్రభాత సూర్యుడు : తెలంగాణ మాలిదశ ఉద్యమంలో తన పాట మాట ద్వారా జనాన్ని చైతన్య పరిచిన సాంస్కృతిక యోధుడు సాయిచంద్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు.. శుక్రవారం మెట్ పల్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో సాయిచంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.....సాయి చంద్ తమకు దగ్గరి మిత్రుడని, ఎలక్షన్‌లో మన నియోజ కవర్గంలో కూడా వచ్చారని తెలుపుతూ అతని మరణ వార్త నన్ను తీవ్ర గ్భ్భాంతికి గురి చేసిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో సాయి చంద్ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు..స్వరాష్ట్రం కోసం తన స్వరాన్ని అంకితం ఇచ్చాడన్నారు. సాయి చిన్నతనంలోనే కన్ను మేయడం బాధాకరమని సాయిచంద్ భౌతికంగా మన కు దూరమైన తన పాట రూపంలో తెలంగాణ గడ్డపై సజీవంగా ఉంటాడని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# వ్యక్తిగత దూషణలతో రాజకీయంగా ఎదుగలేవు

- జగిత్యాల రాజకీయ వాతావరణాన్ని పాడుచేయకు
- నీకు రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్సే
- నీకు ఓ నిక్ నేముతో మేము కూడా ప్రచారం చేయగలం
- భోగ శ్రావణి కి హితబోధ చేసిన డా.చంద్రశేఖర్ గౌడ్




జగిత్యాల -ప్రభాత సూర్యుడు : రాజకీయాల్లోకి కొత్తగా అడుగు పెట్టిన బీజేపీ నాయకురాలు శ్రావణి దశాబ్దాల జగిత్యాల రాజకీయ వాతావరణాన్ని వ్యక్తిగత దూషణలతో మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఈ పద్ధతి మార్చుకోవాలని జిల్లా గ్రంధాలయాల సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ హితబోధ చేశారు. శుక్రవారం నాడు జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇటీవలే ఎమ్మెల్యే సంజయ్ పై బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి చేసిన ఆరోపణలపై బీఆర్ ఎస్ నాయకులు కౌంటర్ ఎటాక్ చేశారు. ఈ సందర్భంగా డా.చంద్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ జగిత్యాల రాజకీయ పరిసరాలు గత ముప్పది ఏండ్లకు పైగా గౌరవప్రదముగా ఉన్నాయన్నారు. కానీ ఇటీవలి కాలంలో బీజేపీ నాయకుల మూలంగా ప్రజలకు జరగాల్సిన మేలుకంటే వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయ వాతావరణం కలుషితమవు తోందన్నారు. ఇందులోనూ బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి కేవలం ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ నే టార్గెట్ చేస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందన్నారు. ఇది సరియైన పద్ధతి కాదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, రాజేశం గౌడ్, రమణ వంటి సీనియర్ నాయకులు ఏనాడు వ్యక్తిగత దూషణలు దిగలేదని ఇప్పుడు ఇదో అలవాటుగా మారిందని చంద్రశేఖర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో అధికార పార్టీ తప్పిదాలను నిర్మాణాత్మక రీతిలో విమర్శలు చేయాలని అవి కూడా సద్విమర్శలుగా ఉండాలన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తెచ్చిన దరిద్రపు వ్యక్తిగత దూషణల అలవాటు ఇప్పుడు శ్రావణి అమలు చేస్తోందని ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని డా. చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. పులకేసి అంటూ ఆరోపిస్తున్న శ్రావణి కి మెమో నికు నేము పెట్టి ప్రజల్లోకి తీసుకెళ్లొచ్చని కానీ మేమా రూట్లో పొదలుచుకోలేదని డా.చంద్రశేఖర్ గౌడ్ చెప్పారు. మా పార్టీ బిసిలకు అన్యాయం చేసిందని మాట్లాడుతున్న భోగ శ్రావణికి రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్ అని మరిచి పోరాదన్నారు. వాస్తవానికి బీజేపీ పార్టీ బిసి లకు చేసిమెదేమిటో చెప్పాలని చంద్రశేఖర్ గౌడ్ ప్రశ్నించారు. దేశ ప్రధాని మోడీ బిసి అయి కూడా బిసి కుల గణన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి వర్గంలో బిసి మంత్రిత్వ శాఖ ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. శ్రావణికి బీసీలపై ప్రేమ ఉంటే కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని బిసిల సమస్యలపై నిలదీయాలని డా. చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, చేపడుతున్న సంక్షేమ పతకాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వమే పేర్లు మార్చి అమలుచేస్తోందన్నారు. ఇంతకీ బిజెపి పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పతకాలను ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఇప్పుడే అడుగుపెట్టిన బోగ శ్రావణి స్థానిక రాజకీయాన్ని వ్యక్తిగత దూషణలతో కలుషితం చేయడం మానుకోవాలని డా. చంద్రశేఖర్ గౌడ్ హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ ఎస్ నాయకులు బాల ముకుందం, బీఆర్ఎస్ పట్టణ మహిళ అధ్యక్ష, కార్యదర్శులు కచ్చు లత, శ్రీమంజరి, అర్బన్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గంగాధర్, గుల్లపేట, జాభితాపూర్, వంజరిపల్లి, గొల్లపల్లి సర్పంచులు తిరుపతి, సతీష్, గంగారాం, ప్రకాష్ తోపాటు పోరుండ్ల ఎంపిటిసి తిరుపతి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై శ్రావణి చేసిన ఆరోపణలను ఖండించారు.

## కల్లుగీతను ప్రమాదరహిత వృత్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### - కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్



అబ్దులాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు : గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ప్రమాద రహిత వృత్తిగా తీర్చిదిద్దే లక్ష్యంగా కార్యాచరణ చేస్తున్నామని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ తొలి చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజీపురం గ్రామానికి చెందిన కారింగు సత్తయ్య గౌడ్ ఇటీవల తాటి చెట్టు మీద నుండి పడి మృతి చెందిన విషయం తెలిసి వారి ఇంటికి స్వయనవెళ్లి నిరుపేద కుటుంబానికి చెందిన సత్తయ్య తక్షణ ఆర్థిక సహాయంగా తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ నుండి మంజూరైన 25వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత వృతిలో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు సేఫ్టీ మోకులు గీత కార్మికులకు అందజేసే విధంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కులవృత్తులను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని ఆయన తెలిపారు. గీత కార్మికులను మరింత అభివృద్ధి పరిచేందుకు, ప్రమాదానికి గురై మృతి చెందిన గీత కార్మికులను ఆదుకునేందుకు గీతన్న భీమా ద్వారా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందివ్వడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నదని రవికుమార్ వివరించారు. గౌడులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నీరా పాలసీ ప్రవేశ పెట్టారని, అదేవిధంగా వైన్ షాపుల కేటాయింపుల్లో గౌడులకు 15 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్ గౌడ్, స్థానిక సర్పంచ్ కావాలి రంగయ్య, లస్కర్ గూడ ఎంపీటీసీ సికా సాయి కుమార్ గౌడ్ సంఘం సొసైటీ అధ్యక్షుడు వర్కల బాల్ రాజు, గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వర్కాల ముత్యాలు గౌడ్, శ్రీశైలం గౌడ్, గుర్జిని వెంకటేష్ గౌడ్, సుఖేందర్, రిటైర్డ్ ప్రిన్సిపల్ కేశవ రావు , తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాల రాస్తున్న బొల్లారం హర్టేక్స్ రబ్బర్ పరిశ్రమ

- ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు కోల్కురి నర్సింహ రెడ్డి
- పరిశ్రమ కార్మిక సంఘం,ఐఎన్టియుసి అధ్యక్షులు మున్సిపల్ వైస్ చైర్మన్ అంతి రెడ్డి అనిల్ రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : కార్మికుల హక్కులను కాలరాస్తూ, నిబంధనలకు విరుద్ధంగా మూసివేసిన హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమను వెంటనే తెరవాలని ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమ కార్మికుల సమావేశం లో వారు మాట్లాడుతూ..పరిశ్రమ గడిచిన 10 సంవత్సారాలుగా కార్మికుల హక్కులను కాలరస్తు వేతన ఒప్పందం చెయ్యక ఉన్న చట్టాలను విస్మరించి కార్మికుల పొట్ట కొడుతుంది అని అన్నారు గత మే నెలలో 10 రోజులు ఈనెల జూన్ లో 15 రోజులు పరిశ్రమ యాజమాన్యం అనేక సాకులు చూపించి పరిశ్రమను అక్రమ లాక్ ఔట్ ప్రకటించడం ఇది పూర్తిగా పారిశ్రామిక చట్టాలను ఉల్లంఘించడ మే అని అన్నారు అలాగే భద్రత సాకుతో గత మూడు రోజులుగా పరిశ్రమ మూసి వుంచడం కూడా అన్యాయమే అని అన్నారు ఇప్పటి కైన యాజమాన్యం పరిశ్రమను 1జూలై రేపటి నుండి తెరవాలి గతనెల ఈ నెల లో పరిశ్రమ పనిచేసిన రోజులకు వేతనాన్ని వెంటనే ఇవ్వాలి గుర్తింపు కార్మిక సంఘం తో వేతన ఒప్పందని వెంటనే చర్చలు ప్రారంభించాలి యాజమణ్యం మొ0డీ కెస్తే త్వరలో కలెక్టరేట్ కార్మిక శాకని ముట్టడిస్తామని అన్నారు కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అమర్ యాదవ్ బోవే లాల్ ఉమేష్ యాదవ్ సింగ్ తదితరులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com